క్లుప్తంగా

స్థల వివాదాన్ని పరిష్కరించాలి

పాలకొండ: నగర పంచాయతీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో సర్వే నంబర్ 20, 21లో ఉన్న స్థల వివాదాన్ని రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని సీపీఎం నాయకులు దావాల రమణారావు కోరారు. మంగళవారం ఆ స్థలాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. అసలు ఆ స్థలం స్వభావంపై రెవెన్యూ అధికారులు బహిరంగ ప్రకటన చేయాలన్నారు. ఆ స్థలం ఆక్రమణ జరిగిందని ఇటీవల వచ్చిన ఫిర్యాదుల మేరకు పరిశీలన చేసి వాస్తవాలను తెలియజేయాలని కోరారు. అది ప్రభుత్వ స్థలమా లేదా అనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు కాద రాము ఉన్నారు.

సీఎం సహాయ నిధి అందజేత



బాధిత కుటుంబానికి సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: మండలంలోని బాలేరుకు చెందిన గొటివాడ లక్ష్మీనారాయణ(56) ఇటీవల క్యాన్సర్ లక్షణాలతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి లక్ష రూపాయల ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే కళావతి మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదలను ఆదుకోవడంలో సీఎం జగనన్న ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, ఎంపీటీసీ పాలక ఉషారాణి, సర్పంచ్ జామి ప్రభాకర్, పార్టీ నాయకులు దామోదర కంఠయ్య, కొత్తకోట ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రంలో వసతుల పరిశీలన



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ సూర్యచంద్రరావు

సీతంపేట: మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎంఈఓ-2 సూర్యచంద్రరావు మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రంలో ఉన్న వసతులు, విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. ఆంగ్లం, గణితంతో పాటు ఇతర సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు వేసి విద్యార్థులతో సమాధానాలు రాబట్టారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులను అభినందించారు. ఆయన వెంట హెచ్ఎం ఎస్.ప్రసాద్, ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు ఉన్నారు.

దేశాభివృద్ధిలో యువతదే కీలక పాత్ర



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్యాంబాబు

పాలకొండ రూరల్: దేశాభివృద్ధిలో యువతదే కీలక పాత్ర అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం యువ సంవాద్ ఇండియా-2047 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్, పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ.. యువత క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేయాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని వాటిని చేరుకునేందుకు ప్రణాళికతో కృషిచేయాలని సూచించారు. దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, బి.రాజు, ఎం.శాంతి, తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నిబంధనలు అతిక్రమించిన వారిపై అపరాధ రుసుం విధిస్తున్న సీఐ

పాలకొండ రూరల్: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సీఐ మీసాల చంద్రమౌళి అన్నారు. స్థానిక కోటదుర్గమ్మ దేవస్థానం కూడలి, రాజాం, వీరఘట్టం రహదారుల్లో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్లను గుర్తించి ట్రాఫిక్ నిబంధనలపై వారికి అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే.. వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి, మితిమీరిన వేగంతో, అధిక లోడుతో, పరిమితికి మించి ప్రయాణికులతో వచ్చే వాహనాలపై అపరాద రుసుం విధించారు.

కిచ్చాడలో అభివృద్ధి కేక

- టీడీపీ పాలనలో అభివృద్ధికి దూరం..
- నేడు అభివృద్ధిలో ఆదర్శం
- పంచాయతీ పరిధిలో 2,863 మందికి సుమారు రూ.8.73 కోట్లతో సంక్షేమ లబ్ధి
- సీసీరోడ్లు, కాలువలు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం

కురుపాం: పల్లె ప్రగతికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్టంకడుతోంది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో చేపడుతోంది. టీడీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన కిచ్చాడ గ్రామం నేడు అన్ని వసతులతో ఆదర్శంగా నిలుస్తోంది. కురుపాం నియోజకవర్గ కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కిచ్చాడ పంచాయతీ పరిధిలో కిచ్చాడ, వెంకటాపురం, రామకృష్ణాపురం, పట్టాయిదొరవలస గ్రామాలు ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయంలో పంచాయతీ అభివృద్ధిపై కనీసం దృష్టి సారించకపోవడంతో ప్రజలు మౌలిక వసతులకు నోచుకోక ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చొరవతో సర్పంచ్ గవర రాజ్యలక్ష్మి పంచాయతీ అభివృద్ధికి బాటలు వేశారు.



రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామసచివాలయం



నాడు-నేడులో భాగంగా సుందరంగా తీర్చిదిద్దిన ప్రాథమికోన్నత పాఠశాల

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన పనులు

- కిచ్చాడ పంచాయతీ/సచివాలయం పరిధిలో అర్హులైన 2863 మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు రూ.8,73,03,214లు లబ్ధి జరిగింది.
- కిచ్చాడ గ్రామానికి రూ.1.42 కోట్లతో బీటీ రహదారి నిర్మాణం చేపట్టారు.
- గ్రామంలో రూ.35 లక్షలతో సచివాలయం, రూ.21.80 లక్షలతో రైతుభరోసా కేంద్రాన్ని నిర్మించారు.
- 'గడపగడప మన ప్రభుత్వం' నిధులు రూ.14 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీలు, కల్వర్ట్‌ల నిర్మాణం చేపట్టారు.
- రూ.11 లక్షలతో నాడు-నేడు కింద ప్రాథమికోన్నత పాఠశాలలో సుందరీకరణ పనులు చేపట్టారు.
- పట్టాయిదొరవలస పంచాయతీ నిధులతో రూ.80 వేలతో ఐదువేల లీటర్ల సామర్థ్యం గల తాగునీటి రక్షిత పథకం ఏర్పాటు.



ఇంటింటికీ కుళాయి సౌకర్యం

రూ.65,000లతో రచ్చబండ నిర్మాణం.

- వెంకటాపురంలో రూ.1లక్షా 25వేలతో 3వేల లీటరల సామర్థ్యం గల తాగునీటి పథకం, పైపు లైన్లు ఏర్పాటు.
- కిచ్చాడ ఎస్టీవీధిలో పంచాయతీ నిధులు రూ.92 వేలతో సీసీ కాలువల నిర్మాణం. రూ.1లక్షా 83 వేలతో సీసీరోడ్డు, డ్రైన్ నిర్మాణం.
- మెయిన్ వీధిలో రూ.1లక్షా 92 వేలతో డ్రైన్ నిర్మాణం.



రూ.1.42 కోట్లతో కిచ్చాడ గ్రామానికి నిర్మించిన బీటీ రోడ్డు

అభివృద్ధికి కేరాఫ్‌గా కిచ్చాడ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నమ్మకం ఉంచి నన్ను పంచాయతీ ప్రజలు సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. పంచాయతీ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి సహకారంతో పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. గత టీడీపీ ప్రభుత్వంలో పంచాయతీ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం.

– గవర రాజ్యలక్ష్మి, సర్పంచ్, కిచ్చాడ గ్రామం

- మండల పరిషత్ నిధులు రూ.1 లక్షా 83 వేలతో సీసీరోడ్డు, డ్రైన్ల నిర్మాణం.
- కిచ్చాడ పంచాయతీ కేంద్రంలోని ఎస్టీవీధిలో మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో ఐదు వేల లీటర్ల సామర్థ్యం గల తాగునీటి రక్షితపథకం, ఇంటింటికి కుళాయిల ఏర్పాటు.



పంచాయతీ పరిధిలోని పట్టాయిదొరవలసలో రూ.80 వేలతో ఏర్పాటు చేసిన రక్షితపథకం

- గడపగడపకు కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పరిధిలోని కిచ్చాడ, వెంకటాపురం, రామకృష్ణాపురం గ్రామాల్లో రూ.14 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మాణం చేపట్టడం జరిగింది.

నిస్వార్థ సేవకులు వలంటీర్లు



పాలకొండ: వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కళావతి, తదితరులు

పాలకొండ: నిస్వార్థ సేవకులు వలంటీర్లని, వారి సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో మంగళవారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్‌రావు, వాకముడి అనీల్‌కుమార్, ఎంపీడీఓ పడితల్లి, నల్లి శివప్రసాద్, మజ్జి నవీన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

- భామిని: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే కళావతి పాల్గొని పురస్కారాలు పొందిన వలంటీర్లను సత్కరించారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉంటూ స్వచ్ఛందంగా సేవలందిస్తున్న వలంటీర్లను సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, డైరెక్టర్ కె.ఆంజనేయులు, వలంటీర్ల సంఘ కన్వీనర్ తలగాన కృష్ణ, ఎంపీటీసీలు బిడ్డిక తులసీ, పాలక ఉషారాణి, సర్పంచ్‌లు భార్గవనాయుడు, మడపాలన కేశవ, తదితరులు పాల్గొన్నారు.



భామిని: సేవా వజ్ర అవార్డు పొందిన వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కళావతి

- సీతంపేట: మండలంలోని కుడ్డపల్లి గ్రామ సచివాలయం పరిధిలో సేవలందిస్తున్న వలంటీర్లను మంగళవారం గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. సేవావజ్ర బి.స్వర్ణకుమారి, సేవారత్న వినీత్‌కుమార్‌తో పాటు సేవా మిత్ర పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లను గ్రామ కార్యదర్శి వై.పాపారావు ఆధ్వర్యంలో సన్మానించారు.
- గరుగుబిల్లి: మండంలోని తోటపల్లి గ్రామ సచివాలయ పరిధిలో ఎంపీడీఓ పి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన పలువురు వలంటీర్లను స్థానిక సర్పనంచ్ ఆవాల సింహాచలమమ్మ సేవా మిత్ర పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.
- గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామ సచివాలయం పరిధిలో సేవలందిస్తున్న వలంటీర్లను స్థానిక సర్పంచ్ మండంగి జగ్గారావు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ కన్వీనర్ తోయక గోపాల్, తదితరులు మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు, సచివాలయం ఉద్యోగులు ఉన్నారు.



గరుగుబిల్లి: తోటపల్లిలో వలంటీర్లను సత్కరిస్తున్న సర్పంచ్ సింహాచలమమ్మ



గుమ్మలక్ష్మీపురం: తాడికొండలో పురస్కారాలు పొందిన వలంటీర్లతో సర్పంచ్ జగ్గారావు, సచివాలయ ఉద్యోగులు



సీతంపేట: కుడ్డపల్లిలో వలంటీర్లను సత్కరిస్తున్న గ్రామ కార్యదర్శి, తదితరులు

కొలతలు ఇచ్చి పనులు చేయించాలి

గరుగుబిల్లి: ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి ముందస్తుగా కొలతలు ఇవ్వాలని క్లస్టర్ ఏపీడీ జి.శ్రీహరి సూచించారు. గరుగుబిల్లిలో చేపడుతున్న ఉపాధిహామీ పథకం పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు. ఉపాధి పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు నిర్దేశించిన వేతనం గిట్టుబాటు అయ్యేలా చూడాలని, పని ప్రదేశంలో సాంకేతిక సహాయకులు ముందుగా కొలతలు ఇచ్చిన అనంతరం పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. వేతనదారులు రెండు పూటలా పనుల్లో పాల్గొనేలా వారికి అవగాహన కల్పించాలని, ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్ ద్వారా హాజరును నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఏపీఓ ఎం.గౌరీనాథ్ ఉన్నారు.



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీడీ శ్రీహరి

జయకృష్ణా.. అసత్య ఆరోపణలు మానుకో..

పాలకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ పార్టీకి పునాది విశ్వసనీయత. మా పార్టీ తరుపున ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించిన ఎమ్మెల్యే కళావతి తన ఇంటిపేరులోనే విశ్వాసాన్ని ముడివేసుకున్నారని ఎంపీపీ బొమ్మాళి సుదాభాను అన్నారు. మంగళవారం సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల శంఖారావం సభలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జయకృష్ణ ఎమ్మెల్యే కళావతిపై సత్యదూరమైన ఆరోపణలు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. పలుమార్లు ఓటమి చవిచూసిన జయకృష్ణ, పార్టీ పెద్దల మెప్పు పొందేందుకు ఎమ్మెల్యే కళావతిపై అసత్య ఆరోపణలు చేయడంపై మండిపడ్డారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇన్‌చార్జిగా ఉన్న నీవు, మీ పార్టీ నాయకులు, జన్మభూమి కమిటీలు చేసిన అక్రమాలు, దందాలను నియోజకవర్గ ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. పదవుల కోసం వ్యక్తిత్వాన్ని దిగజార్చుకోవద్దని హితవుపలికారు. ఆకాశంపై ఉమ్మి వేసేందుకు ప్రయత్నిస్తే అది నీమీదే పడుతుందని తెలుసుకోవాలని సూచించారు. ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు, శ్రేణులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై, ప్రజాప్రతినిధులపై అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్, వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్, మండల సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు తిర్లంగి ఉపేంద్రకుమార్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్, నాయకులు మజ్జి నవీన్‌కుమార్, వంజరాపు కొండలరావు, సింగంవలస విజయ్‌కుమార్, కోట అజేయ్ కుమార్, కె.సూర్యనారాయణ, లావేటి శ్యామ్‌సుందర్, కోట బాబురావునాయుడు, లెంక చంద్రమౌళి, బలగ మన్మథరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రూ.62 కోట్లతో మెగా వాటర్ స్కీం

భామిని: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ టి.ఢిల్లేశ్వరరావు అన్నారు. తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు వంశధార నది నుంచి నీటిని సరఫరా చేసేందుకు సుమారు రూ.62 కోట్లతో మెగా తాగునీటి పథకం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ మేరకు సింగిడి వద్ద వంశధార నదిలో నీటి లభ్యతను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అమరాన సందీప్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. మండలంలోని బురజోల మెట్ట వద్ద మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీంకు సంబంధించి 1.2 లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్ నిర్మించనున్నట్లు చెప్పారు. కేంద్ర జలజీవన పథకం కింద నిధులు మంజూరయ్యాయని, టెండర్లు ఖరారైన అనంతరం పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.



సింగిడి వద్ద వంశధార నదిలో నీటి లభ్యతను పరిశీలిస్తున్న అధికారులు

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి



వీరఘట్టం: భక్తులచే పూజలందుకున్న సత్యనారాయణస్వామి

భామిని/వీరఘట్టం: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని వైష్ణవ ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచే ఆలయాల వద్దకు చేరుకుని పూజలు, అభిషేకాలు చేశారు. భామిని, బత్తిలి, నేరడి-బి, తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతూ కనిపించాయి. వీరఘట్టంలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో అర్చకులు సర్వాజోస్యుల చంద్రమౌళి శర్మ, సతీష్ శర్మ, రమేష్ శర్మలు భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. అలాగే కడకెల్ల, తలవరం, బిటివాడ గ్రామాల్లోని ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది.



భామిని: నేరడి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి

పార్వతీపురంటౌన్: ప్రాథమిక, హైస్కూల్ స్థాయిలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని పార్వతీపురం ఎంఈఓ సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్వతీపురం మండల పరిధిలోని చినబొండపల్లి, ఎమ్మార్‌నగరం పట్టణ పరిధిలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ సంస్కృత ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను ఎంఈఓ సామల సింహాచలం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో ఎప్పటికప్పుడు తీసుకువస్తున్న నూతన విద్యావిధానాలకు అనుగుణంగా తరగతి గదిలో బోధన జరగాలన్నారు. ఉపాధ్యాయలు ప్రతి నెలా కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమాల్లో అవగాహన చేసుకుంటున్న నూతన బోధన విషయాలను విద్యార్థులకు సులభ రీతిలో అర్థమయ్యేలా వివరించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు డి.విజయ్‌కుమార్, గౌరి, హేమసుందర్, వరప్రసాద్, సీఆర్ఎంటీలు, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

పాలకొండ రూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని విశ్రాంత న్యాయమూర్తి లోలుగు అప్పారావు అన్నారు. మండలంలోని లుంబూరు గ్రామంలో కొలువుతీరిన పట్టాబమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల విస్తరణకు కృషిచేసిన పలువురిని ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, నాగవంశపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్, ఏపీపీలు కడిమి సూర్యకుమార్, చంద్రకుమార్, ఎంపీడీఓ కార్యాలయ పరిపాలన అధికారి దొండ త్రినాథులు, రౌతు వాసునాయుడు, సబ్బా నానాజీరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న లోలుగు అప్పారావు, లుంబూరు గ్రామస్తులు

గ్రామస్థాయిలోనే మెరుగైన వైద్యం

గరుగుబిల్లి: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజలకు గ్రామస్థాయిలోనే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని తోటపల్లిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. రోగులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.కార్తీక్, ఈఓపీఆర్డీ గోపాలరావు, సర్పంచ్ ఆవాల సింహాలమ్మ, సచివాలయం సిబ్బంది, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

రాయగడ జమ్ములో..

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ము గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేశారు. శిబిరంలో అందించిన వైద్య సేవలను ఎంపీడీఓ జి.జగదీష్ కుమార్ పర్యవేక్షించారు.



గరుగుబిల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, వైద్యులు, తదితరులు

కొండాపురంలో..

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్యులు శిబిరంలో పాల్గొని సుమారు 430 మందికి వైద్య సేవలందించారు. ఎంపీడీఓ పైడితల్లి శిబిరంలో అందుతున్న సేవలను పర్యవేక్షించారు.



గుమ్మలక్ష్మీపురం: కంటి వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జగదీష్‌కుమార్



పాలకొండ: రోగుల ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న వైద్యుడు